అధికారుల అండతోనే కబ్జాలు..!

- ప్రభుత్వ భూమి కబ్జాపై ఊసెత్తని ఉన్నతాధికారులు
- దొంగపత్రాలు సృష్టించి దర్జాగా స్థలం అమ్మకాలు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది హస్తమున్నట్లు ఆరోపణలు



నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలు

నిజామాబాద్ నాగారం : నగరం నడిబొడ్డున ఉన్న న్యాల్‌కల్ రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. తనిఖీలకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా మౌనం పాటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండ్రోజుల క్రితం కబ్జాస్థలంలో ఉన్న హరితహారం మొక్కలను తొలగించే ప్రయత్నం జరగగా స్థానికులు అడ్డుపడగా కబ్జాదారులు వెళ్లిపోయారు.

నేతలున్నారన్న ధైర్యంతోనే..

నగరంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో రేడియోస్టేషన్ వద్ద వాటర్ ట్యాంక్ ప్రాంతంలో రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలం ఉంది. సర్వేనం. 1,687లో మొత్తం 16 ఎకరాల 14 గుంటల భూమి ఉంది. ప్రజాప్రతినిధి అండతో పాటు స్థానిక అధికారుల సహకారంతో దర్జాగా ఈ భూమిని కబ్జా చేసేశారు. హరితహారం కింద మొక్కలు నాటిన మొక్కలను కొన్నింటిని తొలగించారు. ఇందులో సుమారు 800 గజాల భూమిపై అక్రమార్కులు కన్నేశారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి 150 గజాల చొప్పున పలువురికి అమ్మేశారు. గజం రూ. 25 వేల నుంచి రూ. 30వేల వరకు ఆ ప్రాంతంలో రేటు పలుకుతుండగా కేవలం రూ. 9 వేలకే అందికకాడికి అందుకుని స్థలాన్ని అమ్మేశారు. ఇందులో చోటామోటా నాయకులకు డబ్బుల పంపిణీ కూడా జరిగినట్లు సమాచారం. అక్కడ స్థలం కొన్న ఓ సంఘం సభ్యులు ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధిని ఒప్పించి రూ. 7 లక్షల నిధులు కూడా మంజూరు చేయించుకున్నారు.

ముడుపులందుకుని మౌనంగా..

నగరంలో ఎక్కడైనా అక్రమ కట్టడాలు జరిగిన బల్దియాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు వెళ్తుంటారు. న్యాల్‌కల్‌రోడ్‌లో ప్రభుత్వ భూమి కబ్జాపై 'సాక్షి'లో కథనాలు రాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంలోని తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు కలిసి తనిఖీలు చేశారు. అక్రమార్కుల, ప్రజాప్రతినిధిల ఒత్తిళ్లతో పాటు పెద్దఎత్తున ముడుపులు అందుకొని మౌనంగా ఉండిపోయారని స్థానికులు మాట్లాడుకుంటున్నారు.

ఓ సంఘం భవనం నిర్మాణం కోసం..

అక్రమార్కులు కబ్జా చేయడంతో పాటు ఓ సంఘం కూడా ప్రస్తుతం ఆ ప్రాంతంలో స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవల ఓ రాత్రి ఆ ప్రాంతంలో హరితహారం మొక్కలు తొలగించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుపడడంతో వారు వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తేనే ప్రభుత్వ భూమికి రక్షణ ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



మాట్లాడుతున్న చైర్మన్ మోహన్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సొసైటీలో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఈవో నర్సయ్య జమా ఖర్చుల నివేదికను సమావేశాన్ని ముందుంచారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 31న మహాజన సభ సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. జమా ఖర్చుల నివేదికలో సభ్యుల సందేహాలను సీఈవో నర్సయ్య నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముదక్‌పల్లి డైరెక్టర్లు గైర్హాజరు

బాడ్సి సొసైటీలో గురువారం జరిగిన పాలకవర్గ సమావేశానికి ముదక్‌పల్లికి చెందిన వైస్ చైర్మన్ సహా ముగ్గురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. ఒప్పందం ప్రకారం ప్రస్తుత చైర్మన్ మూడేళ్ల గడువు ముగిసినప్పటికీ.. ఎటూ తేల్చకపోవడంతో డైరెక్టర్లపై గ్రామస్తులు ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గ్రామస్తుల ఒత్తిడి మేరకే సమావేశానికి గైర్హాజరైనట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే ముదక్‌పల్లి టీఆర్ఎస్ నాయకులు, డైరెక్టర్లు స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి ఆయన దృష్టికి ఒప్పందం అంశాన్ని తీసుకెళ్లారు. ప్రస్తుతం ఒప్పందం బంతి ఆయన కోర్టులో ఉంది. ఒప్పందం ప్రకారం గ్రామానికి చైర్మన్ పదవి అప్పగించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తిచేస్తున్నారు. ఎమ్మెల్యే ఎవరివైపు మొగ్గ చూపుతారో వేచి చూడాలి.

షరతుల్లేని ప్రేమాభిమానాలు పంచాలి



అమ్మనాన్నల కాళ్లు మొక్కుతున్న చిన్నారులు

నిజామాబాద్ సిటీ : తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎలాంటి షరతులు లేని ప్రేమాభిమానాలను పంచాలని, పిల్లలతో స్నేహితులుగా ఉండాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మెజీషియన్ వేదాంతం రంగనాథ్ అన్నారు. విశ్వతేజస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని వర్ని రోడ్ వీఎస్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో విజయోస్తు పేరుతో ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు గురువుల పట్ల ప్రేమభావంతో ఉన్నప్పుడే జీవితంలో విజయాలు సాధిస్తారని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు తమ మాతృమూర్తులకు కాళ్లు కడిగి హారతులిచ్చి పాదాభివందనం చేయగా, చిన్నారులను మాతృమూర్తులు ఆలింగనం చేసుకుని ఉద్వేగాన్ని ఆపుకోలేక కంటతడి పెట్టారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి ఈ సందర్భంగా తల్లిదండ్రుల త్యాగాన్ని విద్యార్థులకు వివరిస్తూ మాటల ద్వారా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింపజేశాయి. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ యాదేశ్ గౌడ్, డైరెక్టర్ ప్రసన్న, వీణా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ చరిత్రను అధ్యయనం చేయాలి

తెయూ(డిచ్‌పల్లి) : తెయూలో ఈనెల 28, 29వ తేదీల్లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహణకు అవకాశం కల్పించాలని తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభ్యులు గురువారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి ఎంతో గొప్ప చరిత్ర, సంస్కృతి ఉన్నాయని వాటిని మరింత విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహణకు వీసీ సానుకూలత వ్యక్తం చేశారు. వీసీని కలిసిన వారిలో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ప్రతినిధులు ప్రొఫెసర్ వెంకటరాజ్యం, వీరేందర్, రమేశ్, ఆనంద్ ఉన్నారు. ఈ సమావేశంలో తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, సదస్సు కోఆర్డినేటర్ బాల శ్రీనివాసమూర్తి, నిర్వహణ కమిటీ సభ్యులు సీహెచ్‌ఆంజనేయులు, సాయిలు, అబ్దుల్ ఖవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం అదనపు గదుల నిర్మాణ పనులను లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, వ్యాపారవేత్త గడ్డం రాజారెడ్డి ప్రారంభించారు. పాఠశాలలో దాతల సహకారంతో సుమారు ఐదు అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. సర్పంచ్ జక్కం చంద్రకళ బాల్‌కిషన్, ఎంపీటీసీ సభ్యులు తలారి మరియా సతీష్, గడ్డం గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, రిటైర్డ్ డీఈ రాజేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీధర్, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ధర్పల్లి : మండల కేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు నిజమైన దేశభక్తుడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆర్యవైశ్య సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి శేఖర్, నూకల గంగాధర్, సిద్దేశ్వర్, దొంతుల రాజశేఖర్, సోమ రాంప్రసాద్, నూకల రాజ గంగయ్య, పాల్ది గంగాదాస్, సంతోష్, గంగాబాపు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వీసీ



తెయూ(డిచ్‌పల్లి) : జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సీ.పార్థసారధి గురువారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధినిలు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్థసారధికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆహార కిట్స్ పంపిణీ



నిజామాబాద్ సిటీ : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ సుదర్శన్ చేతుల మీదుగా ఆహార కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీబీ రోగులకు చికిత్స అందించడంలో జిల్లా ముందంజలో ఉందని, టీబీ రావడానికి గల కారణాలను, నివారణకు ఆహారపు అలవాట్లను అదే విధంగా పోషకాహారం తీసుకోవడంపై డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ తోట రాజశేఖర్‌ను అభినందించారు. రెడ్ క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ అవసరమైన వారికి సేవలు అందించటం రెడ్‌క్రాస్ ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, టీబీ నిరోధక శాఖ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు పాటు పడాలి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు ఆదె ప్రవీణ్‌కుమార్

నిజామాబాద్ నాగారం : సమాచార హక్కు చట్టం పౌరులందరికి ఒక వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సమాచార హక్కు చట్టం-2005 పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆదె ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో సమాచార హక్కు చట్టం -2005 పరిరక్షణ కమిటీ నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ.సలీం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స.హ చట్టం కింద దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సంబంధిత అధికారి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆదే ప్రవీణ్ కుమా ర్ మాట్లాడుతూ పాలకులు, ప్రభుత్వాధికారులు చేసే తప్పులను యువత ప్రశ్నించే హక్కుందన్నా రు. యువత ప్రశ్నించే హక్కును అలవర్చుకుని ప్రజలకు ప్రభుత్వం, అధికారులు చేస్తున్న తప్పులను తెలియజెప్పాలన్నారు. రాష్ట్ర అడ్వయిజర్ మద్దికుంట చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు దామ నర్సయ్య, జయరాజ్, ఎల్లయ్య, మీడియా ఇన్‌చార్జి ఈర్ల శేఖర్, జిల్లా, ఉపాధ్యక్షులు మట్టెల శేఖర్, రమణ, రంగారావు, మహేశ్వర్, సంజీవ్ పాల్గొన్నారు.

నగర నూతన కార్యవర్గం

నగర అధ్యక్షుడు కొత్మీర్ సంతోష్, ఉపాధ్యక్షులు పుట్ట జైరాజ్, సెక్రటరీ కాంతారావు, జిల్లా సలహాదారుడు కోడి మహేశ్వర్, నగర జాయింట్ సెక్రటరీ-సంజీవ్, చిల్ల కృష్ణ, జిల్లా సలహాదారు కరిపె రాజు, నగర ఉపాధ్యక్షులు వేముల దేవిదాస్, ఆర్మూర్ డివిజన్ ప్రెసిడెంట్ గంట్యాల రాహుల్, నందిపేట ప్రసిడెంట్ నారాయణ ఎన్నికయ్యారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో నూతనంగా నిర్మించిన విజయ సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సిద్దుల గుట్ట ప్రాంతంలో గ్రామాభివృద్ధి కమిటీ, దాతల సహకారంతో విజయ సీతారామచంద్ర ఆలయాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని వీధులగుండా సీతారామచంద్ర విగ్రహాలను ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ గంగారెడ్డి, వీడీసీ చైర్మన్ నితిన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పసుల రవి, కోశాధికారి నరేందర్, ఆలయ పూజారి రాములు మహారాజ్, మాజీ సర్పంచ్ రవిగౌడ్, లోక పురుషోత్తం, గుండేటి సాయరెడ్డి, ఆర్ఎస్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



23వ డివిజన్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మల్లేశ్ యాదవ్



7వ బెటాలియన్‌లో..



పడకల్‌లో..

నిజామాబాద్ సిటీ : నగరంలోని 23వ డివిజన్లో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ మల్లేశ్‌యాదవ్ ప్రారంభించారు. డివిజన్‌లోని వినాయక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరం నెలరోజుల పాటు కొనసాగుతుందన్నారు. శిబిరం సూపర్‌వైజర్ శాంతికుమారి, నసీం కాలనీ అధ్యక్షుడు అబ్దుల్ సలీం, శానిటరీ ఎస్సై నటరాజ్‌గౌడ్, జవాన్ ప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేశాపూర్‌లో..

నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మల్లె వనీత సుభాష్ ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం నాలుగురోజుల పాటు కొనసాగుతుందన్నారు. మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, డాక్టర్ ప్రత్యూష, గ్రామ పెద్దలు నర్సారెడ్డి, రాజారెడ్డి, భూమారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లిలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని కమాండెంట్ ఎస్‌వీ సత్యశ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ డాక్టర్ అనుపమ పర్యవేక్షణలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ గురురాజ్, హరినాథ్ నెహ్రూ, సిబ్బంది శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్స్ వెంకటేశ్వర్లు, ఆంజనేయరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, హెచ్ఈవో శంకర్, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జక్రాన్‌పల్లి : పడకల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుంచాల విమల రాజు స్పష్టం చేశారు. గురువారం జక్రాన్‌పల్లిలోని పడకల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ రిత్విక్, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ గంగారెడ్డి, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ రిజిస్ట్రార్‌కు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శివశంకర్ పదవీ విరమణను పురస్కరించుకుని మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడిన నాటి నుంచి పదవీ విరమణ పొందే వరకు వర్సిటీ అభివృద్ధికి ప్రొఫెసర్ శివశంకర్ ఎంతో సేవలందించాలని కొనియాడారు. అనంతరం ప్రొఫెసర్ శివశంకర్ మాట్లాడుతూ.. వర్సిటీకి నేను చేసిన సేవల కంటే నాకు యూనివర్సిటీ ఇచ్చిందే చాలా ఉందన్నారు. తెయూలో పనిచేయడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభంజన్ యాదవ్, శాంత, మోహన్, శ్రీనివాస్ గౌడ్, రీసెర్చ్ స్కాలర్ పంచరెడ్డి చరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



డిచ్‌పల్లి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంట్రోలర్ చందర్‌నాయక్ మాట్లాడుతూ వేసవికాలం ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి స్థానికుల సాయంతో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు



సిరికొండ : మండల పరిషత్ కార్యాలయంలో మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను గురువారం నిర్వహించారు. 62మంది లబ్ధిదారులకు గాను 47 మంది దరఖాస్తు దారులు హాజరయ్యారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ ఏవో వెంకటేష్ వెటర్నరీ డాక్టర్ బాబురావు బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలో అన్ని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని ఎంపీపీ లతా కన్నీరాం సూచించారు. గురువారం మండల కేంద్రంలో సీసీ రోడ్లు పనులకు స్థానిక సర్పంచి క్యాతం రవి, ఎంపీటీసీ ముత్యంతో కలిసి ఆమె భూమిపూజ చేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచి ద్యావ రవి, నర్సింగ్‌పల్లి ఎంపీటీసీ రాములు, నాయకులు సతీష్‌రెడ్డి, గణపతి, సాయినాథ్, జీవన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బాడ్సి, వడ్డెర కాలనీల్లో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను ఎంపీడీఓ లింగం గురువారం పరిశీలించారు. మార్చి 31వ తేదీలోగా పనులు పూర్తి చేసి ఎంబీలు అందజేయాలని సూచించారు. 21 గ్రామపంచాయతీల్లో రూ.2.65కోట్లతో పనులు చేపడుతున్నారని, నాణ్యతతో చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

బాల కవికి సత్కారం

నిజామాబాద్ సిటీ : ఇటీవలె రాష్ట్ర స్థాయి ఉత్తమ కవిత ప్రతిభ పురస్కారం అందుకున్న బాల కవి జనగామ అభిలాష్ శర్మ ను గురువారం రైల్వే స్టేషన్ రోడ్డు గీత భవనంలో 'తెలుగు వెలుగు' సాహితీ సేవ సంస్థ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. డా. కాసర్ల నరేష్ రావు, తెలుగు వెలుగు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్, సభ సామ్రాట్ వీపీ చందన్ రావు, ప్రముఖ కవి గణపతి అశోక శర్మ, రాజ్ కుమార్ సుబేదర్, మేడిచర్ల శ్రీనాథ్, మెజీషియన్ జాదు రంగనాథ్ బాలకవి తల్లిదండ్రులు సౌమ్య చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.



బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,200	వెండి (కిలో)	68,550
22 క్యారెట్స్	53,650	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	30	50
బెండకాయ	50	70	గాజరుగడ్డ	15	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	30	50	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	10	20	గోబిపువ్వు	25	50
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	40	60
పుదీనా	20	40			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- షాజమ్ ఫ్యూరీ ఆఫ్ ది గాడ్స్ (ఇంగ్లీష్)-10.45
బలగం -1.20 7.45
కబ్జా-4.30 10.30

స్క్రీన్-2- కబ్జా-10.30 ,7.20
పాలానా అబ్బాయి పాలానా అమ్మాయి- 1.30 ,10.40
సార్-4.40

స్క్రీన్-3- పాలానా అబ్బాయి పాలానా అమ్మాయి-10.35,7.40
షాజమ్ ఫ్యూరీ ఆఫ్ ది గాడ్స్ (ఇంగ్లీష్)-1.25,10.30
బలగం -430

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1- కబ్జా -1.10,4.10,7.10,10.10
స్క్రీన్-2 - పాలానా అబ్బాయి పాలానా అమ్మాయి-2.10,7.50 -బలగం-5.00,10.40
స్క్రీన్-3- షాజమ్ ప్యూరీ ఆఫ్ ది గాడ్స్ (ఇంగ్లీష్)-10.50,1.45,7.35,10.30
స్క్రీన్-4- తు జాతిమే మక్కర్-(హిందీ) -12.10,6.10,9.40 - గనా -3.40

దేవి	పాలనా అబ్బాయి పాలనా అమ్మాయి
నటరాజ్	షాజమ్
లలితామహల్	కబ్జా
విజయ్	బలగం

సంక్షిప్తం

ఆకట్టుకున్న క్యాంపస్ బజార్ సేల్



నిజామాబాద్‌అర్బన్ : గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు క్యాంపస్ బజార్ సేల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులలో వ్యవస్థాపక నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా సె ల్ఫ్‌హెల్ప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని చే పట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంజీఎం సీఆర్ఈ మానిటరింగ్ ఆఫీసర్ స్వదీప్తి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలు, కళాకృతులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రి న్సిపాల్ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు

ఖలీల్‌వాడి : కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్క కుటుంబానికి రూ.15 లక్షలు వేస్తారని హామీ ఇచ్చి నెరవేర్చలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం ఒకటో డివిజన్లోని విఠలేశ్వర్ కాలనీలో గల ఫిట్టర్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ జిల్లా ముఖ్యల సమావేశం జరిగింది. కార్యక్రమంలో సీపీ ఐ జిల్లా నాయకులు వై ఓమయ్య, రాజేశ్వర్, రమే ష్, అనిల్, రఘురాం,రంజిత్, అంజలి ఉన్నారు.

24న సభను సక్సెస్ చేయాలి

ఖలీల్‌వాడి : నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఈనెల 24న జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు పేర్కొన్నారు. నగరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నేతలు తదితరులున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో చిన్నపాటి ఈదురు గాలులకే విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం 5.30 గంటల తర్వాత ఈదురు గాలులు వీచాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా నగరంలోని పలు ప్రాంతాలైనా బస్టాండ్‌రోడ్ తదితర ప్రాంతాలతో పాటు, పల్లెల్లో కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటలకు పైనే కరెంట్ లేదు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తే బ్రేక్‌డౌన్ అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు.

పర్యవేక్షణా లోపం...

కరెంట్ సరఫరాలో అధికారులకు, సిబ్బందికి సరైనా పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. వినియోగదారుల వద్ద బిల్లులు ముక్కు పిండి వసూళ్లు చేసినప్పుడు కరెంట్ గంటల తరబడిగా పోతే ఫోన్లు చేస్తే లిప్ట చేయడం లేదని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.